ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 7 నవంబరు 2024
www.prajaaswaramdaily.com
4 pm

# రేపు యాదాద్రికి సీఎం రేవంత్

**కుటుంబసమేతంగా లక్ష్మీనరసింహస్వామి దర్శనం**

**పుట్టిన రోజు కావడంతో ప్రత్యేక పూజలు**

**మధ్యాహ్నం వలిగొండ మండలంలో పర్యటన**

**అనంతరం మూసీ పరివాహక రైతులతో పాదయాత్ర**

హైదరాబాద్, ప్రజాస్వరం : తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు.



లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోనున్నారు. ఉదయం యాదాద్రి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు వైటీడీఏ అధికారులతో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం వలిగొండ మండలం సంగెం భీమలింగంకత్వా వద్దకు సీఎం వెళ్లనున్నారు. మూసీ పరివాహక ప్రాంత రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నారు. పాదయాత్ర ద్వారా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను పరిశీలించారు. అనంతరం మూసీ పరివాహక ప్రాంతం రైతులతో సమావేశం కానున్నారు.

## డెడికేటెడ్ కమిషన్

# జిల్లాల పర్యటన

**11న నుంచి ప్రారంభం**

**జిల్లాల్లో కులసంఘాల నుంచి వినతుల స్వీకరణ**

**కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు**




హైదరాబాద్, ప్రజాస్వరం : సుప్రీంగైడ్‌లైన్స్ ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సాగుతుందని డెడికేటెడ్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. ఒక చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు కసరత్తు చేయనున్నామన్నారు. ఈ నెల 30 లోగా సిఫార్సులు ఇవ్వాలని ప్రభుత్వం కోరిందన్నారు. కుల గణన సర్వే కారణంగా మరింత సమయం పట్టొచ్చన్నారు. సోమవారం నుంచి జిల్లాల పర్యటన ఉంటుందని తెలిపారు. జిల్లాల్లో కుల సంఘాల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

# తగ్గిన బంగారం ధరలు

**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72 వేలు**

**24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,560.**



**ముంబయి :** బంగారం ధరలు తగ్గాయి. అమెరికా ఎన్నికల నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభావం పడిందని విశ్లేషకులు చెబుతున్నారు. రూ.1,650 తగ్గిన 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,790 తగ్గింది. ఒక్క రోజులోనే కేజీ వెండి రూ.3 వేలు తగ్గినట్లు తెలుస్తోంది. ఇక తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72 వేలు, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,560లు పలుకుతోంది.

## అరెస్టు చేస్తే జైలుకు వెళ్లేందుకు

# సిద్ధం



హైదరాబాద్, ప్రజాస్వరం: ఫార్ములా వన్ రేసులు మన దేశంలో కొత్త కాదు అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచినందుకా నాపై కేసులు పెడతానంటున్నారన్నారు. ఎఫ్ 1 రేసుల వల్లే మొనాకో దేశం ప్రపంచానికి తెలిసిందన్నారు. ఎలక్ట్రిక్ కార్లను ప్రమోట్ చేసేందుకే.. ఫార్ములా ఈ-రేసింగ్ నిర్వహించామని మాజీ మంత్రి అన్నారు. నన్ను అరెస్ట్ చేస్తే జైలుకు వెళ్లేందుకు సిద్ధమన్నారు. జైలులో పెడితే యోగా చేసి పాదయాత్రకు సిద్ధమవుతానని వెల్లడించారు. ఏ విచారణకైనా నేను సిద్ధం మన్నారు. హెచ్ఎండీఏ నిధులకు కేబినెట్ ఆమోదం అవసరం లేదని కేటీఆర్ తెలిపారు.

రాజ్‌భవన్‌లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను అంతం చేయాలని చూస్తున్నాయని వ్యాఖ్యానించారు. రూ.50 లక్షల బ్యాగుతో దొరికిన రేవంత్‌పై..8 ఏళ్లుగా ఎలాంటి చర్యలు లేవు అని తెలిపారు. అటెన్షన్ డైవర్షన్ చేయడం కోసమే రేవంత్ చేస్తున్నారని విమర్శించారు.

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచినందుకా నాపై కేసులు?**

**జైలులో పెడితే యోగా చేసి పాదయాత్రకు సిద్ధమవుతా .. ఏ విచారణకైనా సిద్ధం**

**హెచ్ఎండీఏ నిధులకు కేబినెట్ ఆమోదం అవసరం లేదు**

**రాజ్ భవన్ లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని కేటీఆర్ విమర్శ**



## మూసీ ప్రక్షాళన

# చేయాల్సిందే

**నీళ్లు కూడా ఇవ్వాలి**

**కృష్ణా, గోదావరి నుంచి నీరు తీసుకొచ్చినా అభ్యంతరం లేదు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, ప్రజాస్వరం: మూసీ ప్రక్షాళన చేయాల్సిందే, నీళ్లు ఇవ్వాల్సిందే.. కృష్ణా, గోదావరి నుంచి నీళ్లు తీసుకొచ్చినా అభ్యంతరం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఒక్క ఇల్లు కూలగొట్టినా ఊరుకునేది లేదన్నారు. ఇళ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ కట్టాలి అని అన్నారు. సిటీలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. కులగణనకు వ్యతిరేకం కాదు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. నా డీఎన్ఏ ఏంటో ప్రజలకు తెలుసు, ఎవరి సర్టిఫికేట్ అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల

# దాడులు

**కృతుంగ కిచెన్ లో ఎలుకలు, బొద్దింకలు గుర్తింపు**

**హైదరాబాద్, ప్రజాస్వరం:** ఫుడ్ సేఫ్టీ అధికారులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హోటల్లు, రెస్టారెంట్లపై గురువారం దాడులు నిర్వహించారు. మూసాపేట కృతుంగ రెస్టారెంట్ లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రెస్టారెంట్ కిచెన్ లో ఎలుకలు, బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. కిచెన్ లో కుళ్లిన చికెన్ ను అధికారులు గుర్తించినట్లు చెప్పారు. ఈ మధ్య కాలంలో ఆహార భద్రత అధికారులు హోటళ్లు, రెస్టారెంట్స్ పై వరసగా దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.

# కోతిని తప్పించబోయి..

**బైక్ మీద నుంచి పడి ఉపాధ్యాయుడి మృతి**

**చేర్యాల మండలంలో ఘటన**

**చేర్యాల,ప్రజాస్వరం :** కోతి అడ్డం వచ్చి ద్విచక్ర వాహనాదారుడు మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పర్పటకం ధర్మారెడ్డి ఇదే మండలంలోని చూంచనకోట లో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఇంటి నుంచి హెల్మెట్ ధరించి స్కూటీపై బయలుదేరాడు. చూంచన కోట శివారులో తన స్కూటికి కోతి అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించబోయినప్పటికి కోతి స్కూటి మధ్యలో ఇరుక్కుని కిందపడ్డాడు. దీంతో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హెల్మెట్ ధరించినా ఉపాధ్యాయుని ప్రాణం కాపాడలేకపోయింది. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## సర్వేలో ఏ పార్టీ అని

# అడుగుతున్నారు

**కులగణనకు విరుద్ధంగా నియమావళి**

**బీసీలను మోసం చేయడానికేనా సర్వే?**

**ఎంపీ అరుణ**




హైదరాబాద్, ప్రజాస్వరం : కులగణనకు విరుద్ధంగా నియమావళి ఉందని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆస్తులు, అప్పులు, భూములు, ఏ పార్టీ అని అడుగుతున్నారన్నారు. వ్యక్తిగత ఆస్తుల వివరాలు ప్రభుత్వానికి ఎందుకు అని ప్రశ్నించారు. ఈ సర్వే దేని కోసమో స్పష్టం చేయాలన్నారు. బీసీలను మోసం చేయడానికే ఈ సర్వేనని అరుణ అన్నారు.

# అభివృద్ధికి ఆటంకం కావొద్దు

**బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

హైదరాబాద్, ప్రజాస్వరం: ఎన్నికల పేరుతో అభివృద్ధికి ఆటంకం కావొద్దు అని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. అందుకే వన్ నేషన్-వన్ ఎలక్షన్ నిర్ణయం అని తెలిపారు. సంపదను ముస్లింలకు మాత్రమే.. పంచిపెట్టాలనే మూలసిద్ధాంతం కాంగ్రెస్‌ది అని వెల్లడించారు. దేశ సంపదకు ప్రతి పౌరుడు అర్హుడని లక్ష్మణ్ వివరించారు. జనవరి నెలాఖరులోగా బీజేపీ రాష్ట్ర, జాతీయ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

# షారూఖ్ ఖాన్‌కు బెదిరింపులు



ముంబయి : బాలీవుడ్ బాద్ షా షారుఖ్(కింగ్ ఖాన్) ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. తాజాగా బాద్ షాకు బెదిరింపు కాల్స్ రావడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో ముంబై పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే రంగంలోకి దిగి కాల్ గురించి ఆరా తీశారు. ఆ ఫోన్ కాల్ ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడని భావించిన ముంబై బాంద్రా పోలీసులు గుర్తించారు. విచారణ జరిపి.. నిందితుడిని రాయ్‌పూర్‌కు చెందిన ఫైజాన్ అని ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేశారు. షారుఖ్ ఖాన్‌కు వచ్చిన బెదిరింపు కాల్ ఫోన్ నంబర్ ఆధారంగా ఫైజాన్ జాడను కనుగొన్నారు. ఈ క్రమంలోనే బాంద్రా పోలీసులు కేసు నమోదు చేశారు.